సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 2 । మే । 2025



అంగన్‌వాడీ టీచర్‌కు వీడ్కోలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సారంపల్లి అంగన్‌వాడీ టీచర్ ప్రభమ్మ 65 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ సుస్మిత ఉన్నారు.



రాజన్నకు అభిషేకాలు

వేములవాడ: రాజన్నను గురువారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. శంకర జయంతి వేడుకల్లో భాగంగా అద్దాల మండపంలో శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్ర వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ఆర్జీ రావు ట్రస్టు అర్హత పరీక్షకు స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

సిరిసిల్లకల్చరల్: ఆర్జీ రావు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఇంజినీరింగ్ విద్యావకాశాల కోసం నిర్వహించిన అర్హత పరీక్షకు స్పందన లభించింది. రగుడులోని రంగినేని మోహన్‌రావు చారిటబుల్ ట్రస్టు ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 500 మంది విద్యార్థులు హాజరైనట్లు ట్రస్టు నిర్వాహకుడు బొంత దామోదర్ తెలిపారు. ట్రస్టు నిర్వాహకుడు రంగినేని మోహన్‌రావు, ఆర్జీ రావు ట్రస్టు మేనేజర్ రాకేశ్, ట్రస్టు కాలేజీ ఇన్‌చార్జి దినేశ్, ఉపాధ్యాయులు సలా వుద్దీన్, శంకర్, విష్ణు, సతీశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రామాల్లో సేవ చేయాలి

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో విద్యార్థులు

బోయినపల్లి(చొప్పదండి): విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సేవచేయాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం కోరారు. బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని తడగొండలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల అసోసియేట్ డీన్ కేపీ సునీతాదేవి మాట్లాడుతూ గ్రామంలో వారంపాటు నిర్వహించే శిబిరంలో వివిధ కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. శిశు సంక్షేమాధికారి రోజా, ఎంఏవో ప్రణిత, ప్యాక్స్ డైరెక్టర్ గుడి శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.అరుణ్‌బాబు, పి.మాధవి, మాజీ సర్పంచ్ చిందం రమేశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. మండలంలోని కోరెంలో టీచర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎండాకాలంలో నెల రోజులు ప్రీ స్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తామన్నారు.

పనిముట్లతో స్వర్ణకారుల నిరసన



స్వర్ణకారులకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలోని స్వర్ణకారులు చేపట్టిన రిలేదీక్షలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి గురువారం సంఘీభావం తెలిపారు. స్వర్ణకారుల కులవృత్తులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్వర్ణకారులు తమ పనిముట్లతో ఆందోళన చేపట్టారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, నరేశ్, భాను, బాల్‌రెడ్డి, ప్రశాంత్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య, బ్రహ్మం, శ్రీను, అనిల్, వెంకటేశం పాల్గొన్నారు.

'చీటి' పార్టీకి పనికిరాడు'



సిరిసిల్లటౌన్: పార్టీకి ఎలాంటి పనిచేయని చీటి ఉమేశ్‌రావుతో సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు లాభం లేదని ఆ పార్టీకి చెందిన మండలాల అధ్యక్షులు అధిష్టానాన్ని కోరారు. సిరిసిల్లలో కోవర్ట్ రాజకీయాలు చేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. చీటి ఉమేశ్‌రావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరా రు. ఆయన ప్రవర్తన ఆది నుంచి అనుమానంగా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల మెప్పుకోసం ఇక్కడ కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాడని ఆరోపించారు. ఈవిషయాన్ని కాంగ్రెస్ పార్టీ పెద్దలు గ్రహించి అతనిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు జల గం ప్రవీణ్, ముస్తాబాద్ మండలాధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, బొప్ప దేవయ్య, రెడ్యానాయక్, రవికుమార్, కల్లూరి చందన పాల్గొన్నారు.

అడవే ఆధారం



వీరు కోనరావుపేట మండలంలోని మారుమూల వట్టిమల్ల–మరిమడ్ల గ్రామాల మధ్య కట్టెలు ఏరుకుంటున్న గిరిజనులు. వట్టిమల్ల గిరిజన తండాకు చెందిన లకావత్ దేవుల్యా దంపతులు తెల్లవారుజామునే అడవిలోకి వెళ్లి ఇలా కట్టెలు ఏరుకుని ఇంటికి తెచ్చుకుంటున్నారు. వంటకు ఈ కట్టెలను వాడుకుంటున్నారు. ఇంటింటికీ ఉజ్వల్ పథకంలో ఉచితంగా గ్యాస్ ఇచ్చామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలు ఇస్తున్నా.. ఇంకా క్షేత్రస్థాయికి ఆ పథకాలు చేరలేవని ఈ దృశ్యం నిరూపిస్తుంది.



వీరు రుద్రంగి మండలంలో గిరిజన తండాలోని మహిళలు. వీరు సమీప అడవిలోకి తెల్లవారుజామునే వెళ్లి తునికాకు సేకరిస్తారు. ఆ ఆకును పొద్దంతా ఇలా మడత పెట్టి కట్టలుగా కట్టి ఎండలో ఆరబెడతారు. ఆరబెట్టిన 50 ఆకులు ఉండే ఒక తునికాకు కట్టను రూ.3.50 చొప్పున విక్రయిస్తారు. అటవీ గ్రామాల ప్రజలకు తునికాకు ఈ సీజన్‌లో మంచి ఆదాయ వనరు. ఒక్కో కుటుంబం ఏప్రిల్, మే నెలల్లో రూ.8వేల నుంచి రూ.15వేల వరకు తునికాకు ద్వారా ఆదాయం పొందుతారు.



తునికాకు కట్టలు ఆరబెడుతున్న మహిళలు

- 'గిరి'జనులకు అడవితల్లి ఆసరా
- కొనుగోలు కేంద్రాలు లేకున్నా.. అటవీ ఉత్పత్తుల సేకరణ
- వేసవిలో ఉపాధి లేక అటవీబాట
- మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తున్న వైనం

అటవీ స్వరూపం

అటవీ విస్తీర్ణం : 379.14 చదరపు కిలోమీటర్లు
అటవీ గ్రామాలు : 62
గిరిజన జనాభా : 36,990

సిరిసిల్ల: తునికాకు.. ఇప్పపువ్వు.. మొర్రిపండ్లు.. జీడిపండ్లు..పొయ్యిలకట్టెలు.. వేసవిలో గిరిజనులకు ఆదాయం ఇచ్చే వనరులు. అడవిలో దొరికే వీటి కోసం నిత్యం ఉదయమే ఫారెస్ట్‌లోకి వెళ్తుంటారు. అటవీ జంతువులతో ప్రమాదమని తెలిసినా ఇతర పనులు లేక అడవిబాట పడుతున్నారు. జిల్లాలో వీర్నపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, రుద్రంగి, చందుర్తి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లో అటవీ గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని గిరిజనులు సమీప అడవిలోకి వెళ్లి సీజన్‌లలో దొరికే అటవీ ఉత్పత్తులను సేకరించి ఉపాధి పొందుతున్నారు.

జీసీసీ లేకున్నా.. ఆగని సేకరణ

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లు సేకరిస్తాయి. జిల్లాలో జీసీసీ లేదు. పొరుగున ఉన్న కామారెడ్డి జిల్లాలో జీసీసీ ఉన్నా.. ఈ జిల్లాలోని అటవీ ఉత్పత్తులను సేకరించరు. గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో తునికాకు సేకరించేవారు. రెండు దశాబ్దాల క్రితం నక్సలైట్ల సమస్యతో తునికాకు సేకరణ నిలిచిపోయింది. తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్లు పిలవడం లేదు. ఇప్పుడు సేకరించిన తునికాకును స్థానికంగా బీడీ కార్మికులకు విక్రయిస్తున్నారు.

అటవీజంతువుల భయం

జిల్లాలోని అడవుల్లో చిరుతలు, ఎలుగుబంట్లు, అడవిపందులు విపరీతంగా ఉన్నాయి. అటవీ సమీప గ్రామాల్లో తరచూ చిరుతలు గేదెలపై దాడి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. అటవీలోకి వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా వేసవిలో ఇతరత్ర ఉపాధి లేక గిరిజనులు కుటుంబ పోషణకు అడవిలోకి వెళ్తున్నారు. ప్రాణాలకు తెగించి తునికాకు, మొర్రిపండ్లు, ఇప్పపూవును సేకరిస్తున్నారు.



నెత్తిపై బస్తాతో అడవిలో నుంచి వస్తున్న ఈ గిరిజన మహిళ భూక్య శీల. వీర్నపల్లి మండలం గర్జనపల్లి శివారులో ఇప్పచెట్ల కింద రాలిన పువ్వును సేకరించి, ముల్లెకట్టుకొని ఇంటికెళ్తోంది. ఉదయం 6 గంటలకే అడవిలోకి వెళ్లి ఇప్పచెట్ల కింద రాలిన పువ్వును సేకరించింది. ఇలా సేకరించిన పువ్వును ఇంటి వద్ద ఆరబెట్టి అమ్ముకుంటుంది. ఇప్పపువ్వును ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. కానీ ఇప్పపువ్వును కొనేందుకు జిల్లాలో గిరిజన సహకార సంస్థలు లేకపోవడంతో నాటు సారా తయారీకి వినియోగిస్తున్నట్లు సమాచారం.

వన్యప్రాణులతో ముప్పు



అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవిలోకి వెళ్లడం తప్పు. జిల్లాలో అటవీ ఉత్పత్తుల సేకరణకు జీసీసీ లేదు. అడవిలోకి తెల్లవారుజామున వెళ్లితే.. వన్యప్రాణులు దాడి చేసే ప్రమాదం ఉంటుంది. చిరుతలు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వన్యప్రాణులు నివాసం ఉండే చోటికి మనం వెళ్లడమే తప్పు. ఎవరైనా వెళ్లినా ముగ్గురు, నలుగురు కలిసి బృందాలుగా వెళ్లాలి.

– వి.శ్రీహరిప్రసాద్, సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి

కులగణన ప్రకటనపై హర్షం



మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకుల క్షీరాభిషేకం

సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా కులగణనకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని బీజేపీ శ్రేణులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మోదీ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా అన్ని కులస్తులు స్వాగతిస్తున్నారన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్, జిల్లా కార్యదర్శి గజభీంకార్ చందు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనగంటి నరేశ్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పండగ మాధవి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు దూడం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు

- జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య

సిరిసిల్ల: జిల్లాలో 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రెండు స్వయం సహాయక సంఘాల మహిళలకు 60 శాతం సబ్సిడీపై మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు మంజూరయ్యాయని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య గురువారం తెలిపారు. నీలి విప్లవం 2018–19 పథకంలో భాగంగా జిల్లాలో 40 శాతం లబ్ధిదారులు వాటాధనం చెల్లించాల్సి ఉందని వివరించారు. ఆసక్తి గల మహిళా సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సౌజన్య తెలిపారు. మే 2 నుంచి 9లోగా కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ ఆఫీస్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 40 శాతం వాటాధనం చెల్లించే ఆసక్తి ఉన్న మహిళా సంఘాలు దరఖాస్తు చేయాలని, 60 శాతం ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని వివరించారు. వివరాలకు 94916 51263లో సంప్రదించాలని కోరారు.

ఉపాధి అలవెన్స్ ఉత్తదేనా..

- అందని వేసవి భత్యం
- పని ప్రదేశంలో సౌకర్యాలు కరువు
- పెండింగ్‌లో కూలీలు, ఉద్యోగుల వేతనాలు
- సమ్మె చేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది



ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల): వలసల నివారణకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలుకావడం లేదు. కూలీలకు సరైన పనిదినాలు కల్పించడం లేదు. ఎండలు మండుతున్నా వేసవి అలవెన్సుల గురించి పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది అలవెన్సును ఇప్పటికీ ప్రకటించకపోవడంతో కూలీలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 98వేల ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉండగా.. 92వేల మంది కూలీలు పనిచేస్తున్నారు. ఇదే సమయంలో కూలీలు, ఉద్యోగులకు వేతనాలు కూడా అందడం లేదు. ఈ విషయమై ఉపాధిహామీ సిబ్బంది బుధవారం నుంచి సమ్మె చేస్తున్నారు.

వేసవిలో అలవెన్సు ఇలా..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో వేసవిలో పనిచేసే కూలీలకు ఏటా అలవెన్సును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చింది. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అలవెన్సు చెల్లించాల్సి ఉంది. ఎండలో నేల కఠినంగా ఉండడంతోపాటు తొందరగా కూలీలు అలసిపోయి ఎక్కువ పనిచేయలేరు. ఈనేపథ్యంలో కూలీలకు వేసవిలో అదనంగా భత్యం చెల్లిస్తారు. 2024–25లో జిల్లాలో కూలీలకు రూ.21.78కోట్లు మంజూరు చేశారు. 2025–26లో రూ.12.43 కోట్లు కేటాయించారు.

పెంచిన వేతనాలతో సరి..

వేసవిలో ప్రత్యేకంగా అలవెన్సును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనప్పటికీ ఉపాధిహామీలో పనిచేసే కూలీలకు గరిష్టంగా రూ.307 నిర్ణయించారు. కనిష్టంగా రూ.222.39 చెల్లిస్తున్నారు. గతంలో రూ.280 ఇవ్వగా, దానిని రూ.27కు పెంచారు. భత్యం చెల్లించకపోవడంతో, పెరిగిన వేతనాలతో కూలీలు సంతృప్తి పడాల్సి వస్తోంది.

98,133 జాబ్‌కార్డులు

జిల్లా వ్యాప్తంగా 98,133 జాబ్‌కార్డులు ఉండగా.. 1,99,721 మంది కూలీలు పనులు చేస్తున్నారు. పథకం అమలులో 34 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 153 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 9 మంది ఏపీవోలు, ఐదుగురు ఈసీఎస్‌లు, 19 మంది సీవోఎస్‌లు పనిచేస్తున్నారు. మూడు నెలలుగా కూలీలకు, ఉద్యోగులకు, సిబ్బందికి వేతనాలు రావడం లేదు.

బయోమెట్రిక్ హాజరు

పని ప్రదేశంలోనే కూలీల హాజరును ఫీల్డ్‌అసిస్టెంట్లు నమోదు చేస్తారు. ఈసారి మాత్రం బయోమెట్రిక్ ద్వారా హాజరు వేస్తున్నారు. పనిలో చేరిన నిమిషంలోనే ముఖాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం, పనిముగిసే సమయంలో ఐరీష్ తీసుకుని అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధి పనులు గుట్టలు, అడవిలో చేస్తుండడంతో అక్కడ నెట్‌వర్క్ సరిగా లేక బయోమెట్రిక్ హాజరుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో రోజు నెట్‌వర్క్ పనిచేయక అప్‌లోడు కావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొంటున్నారు.

పనిప్రదేశంలో సౌకర్యాలు కరువు

వేసవి కావడంతో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు నీడ సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలి. కానీ ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎక్కడ కూడా అవి అందుబాటులో లేవు. ఎండ వేడిమికి తట్టుకోలేక కూలీలు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు.

సకాలంలో రావడం లేదు



సకాలంలో వేతనాలు రావడం లేదు. మూడు నెలలుగా కూలీ డబ్బులు రావాల్సి ఉంది. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇంటి నుంచి తాగునీరు తీసుకొచ్చుకుంటున్నాం. పని ప్రదేశంలో టెంటు వేయాలి.

– గుడికాడి బుచ్చయ్య, కూలీ, గంభీరావుపేట

అలవెన్సు చెల్లించాలి



ఎండలో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం అలవెన్సు ఇవ్వాలి. మండుతున్న ఎండల్లో అతికష్టం మీద పనిచేస్తున్నాం. గతంలో ఎండాకాలంలో అదనంగా అలవెన్సు చెల్లించారు. ఇప్పుడు చెల్లించి కూలీలకు అండగా నిలవాలి.

– చెరుకు స్వప్న, కూలీ, గూడూరు

నెట్‌వర్క్ సమస్య ఉంది



నూతన విధానంలో ప్రత్యేక యాప్ ద్వారా కూలీల హాజరును నమోదు చేస్తున్నాం. మస్టర్ ఎంట్రీ నెట్‌వర్క్‌తో తొందరగా పనికావడం లేదు. ఐరీష్ ద్వారా అటెండెన్స్ తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. కూలీలతోపాటు ఫీల్డ్‌అసిస్టెంట్లకు అలవెన్సు ఇవ్వాలి.

– శ్రావణ్, ఫీల్డ్ అసిస్టెంట్

ఎస్సీ, ఎస్టీ కోర్టు మంజూరు చేయండి



జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ నిమిత్తం ప్రత్యేక న్యాయస్థానాన్ని మంజూరు చేయాలని న్యాయవాదుల సంఘం కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ కోర్టు ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్‌లో ఉండడంతో కక్షిదారులకు దూరభారం అవుతోందన్నారు. జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కోర్టును మంజూరు చేయాలని ప్రతిపాదించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తంగళ్లపల్లి వెంకటి, ఎస్.అనిల్‌కుమార్, వేముల నరేశ్, సర్మెట రమేశ్, వుచ్చిడి శరత్‌రెడ్డి, మహిళా ప్రతినిధి మంద పుష్పలత, సీనియర్ న్యాయవాది దోర్నాల జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు అన్నల్‌దాస్ వేణు, కడగండ్ల తిరుపతి, బూర్ల కల్యాణి, బి.అనీల పాల్గొన్నారు.

పనిచేస్తేనే గుర్తింపు : ఎస్పీ



సిరిసిల్లక్రైం: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. ఇటీవల గ్రూప్–1, గ్రూప్–3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు కృషి చేసిన ఏఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు.

'వర్కర్లను ఓనర్లు'గా మార్చాలి

- నేతన్నలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఏవీ
- ధనిక, పేదల మధ్య వ్యత్యాసం పెరిగింది
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ఆటో కార్మికుడిని సన్మానిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, తోట ఆగయ్య, కళాచక్రపాణి

సిరిసిల్ల: నేతకార్మికులను ఓనర్లుగా మార్చాలని, ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలో గురువారం బీఆర్‌టీయూ నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దూరు బైపాస్ వెంట వర్కర్లను ఓనర్లు మార్చేందుకు షెడ్లను నిర్మించి, వసతులు కల్పించిందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే.. ఈపాటికి వర్కర్లు ఓనర్లు అయ్యేవారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను ఓనర్లను చేయాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. నేతన్నలను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ప్రభుత్వంలో కరువైందన్నారు. కార్మికులకు రూ.5లక్షల బీమా సదుపాయాన్ని తాను ఎంపీగా ఉండగా.. పార్లమెంట్‌లో ఆమోదించామని గుర్తు చేశారు. కార్మిక వర్గాలు అసంఘటితంగా ఉండడంతోనే ఇంకా పేదరికంలో ఉన్నారని, హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పార్టీ నాయకులు గూడూరి ప్రవీణ్, ఆకునూరి శంకరయ్య, దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, మంచె శ్రీనివాస్, రాఘవరెడ్డి, బండ నర్సయ్యయాదవ్, గుండ్లపల్లి పూర్ణచందర్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పోరండ్ల రమేశ్, బత్తుల వనజ, గొట్టె దేవేంద్ర, కమలాకర్, అగ్గిరాములు పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

సిరిసిల్లలోని వివిధ వర్గాల కార్మికులను మేడే సందర్భంగా సన్మానించారు. వచ్చే ఏడాది వేలాది మందితో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు చేయాలని, బీఆర్‌ఎస్ పార్టీ జెండా కాకుండా.. ఎర్ర జెండాను ఎగురవేయాలని వినోద్‌కుమార్ సూచించారు.

సీఎం పోరాట ఫలితమే కులగణన

- సిరిసిల్లలో కాంగ్రెస్ నేతల హర్షం
- రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సిరిసిల్లటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోరాట ఫలితంగానే కేంద్రం దిగివచ్చి జనగణన చేసేందుకు ముందుకొచ్చిందని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణనపై ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. దేశంలో మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. మ్యాన ప్రసాద్, బొప్ప దేవయ్య, నీలి రవీందర్, కల్లూరి చందన, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, గుండ్లపల్లి గౌతం, ఎదురుగట్ల వనిత, రోజా పాల్గొన్నారు.

బీసీల పోరాట ఫలితమే కులగణన

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీసీల పోరాటాల ఫలితంగానే దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం ముందుకొచ్చిందన్నారు. తెలంగాణలో 42 శాతం, బిహార్‌లో 65 రిజర్వేషన్‌ను కేంద్రం ఆమోదించాలని కోరారు. బీసీ నాయకులు వీరవేని మల్లేశ్‌యాదవ్, కమలాకర్, బొప్ప దేవయ్య, తడుక కమలాకర్, ఇల్లంతకుంట తిరుపతి, బచ్చు ప్రసాద్, సామల తిరుపతి, కొండ విజయ్, తొట్ల మల్లేశం, రోహిత్‌యాదవ్, కొండయ్య, దామోదర్, శ్రీనివాస్, నరేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శి సస్పెన్షన్

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు హమాలీలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కట్నం కేసు నమోదు

జమ్మికుంట: అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన శ్రీమతికి భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం అకినపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ భీష్మాచారితో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో శ్రీమతి తల్లిదండ్రులు అడిగిన కట్నకానుకలు అందజేశారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. కొన్నాళ్లుగా శ్రీమతిని భర్త భీష్మాచారి, అత్త మల్లమ్మ, అడపడుచులు పొనగంట మమత, బావండ్లపల్లి రజిత, మరిది గుత్తికొండ అశోక్ అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

జమ్మికుంట: యూఎస్ఏలో ఉన్నత చదువు కోసం టికెట్ బుక్ చేస్తానని మోసం చేసిన ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వి.రవి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన వొల్లాల రవీంద్రనాథ్‌గౌడ్ వద్ద కరీంనగర్‌కు చెందిన అమృత ట్రావెల్స్ అండ్ టూర్స్ యజమాని దయ్యాల సతీశ్ 2023లో టికెట్ బుక్ చేస్తానని రెండు దఫాలుగా రూ.6లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకొని పని చేయాలేదని, మోసపోయినట్లు గుర్తించి బాధితుడి ఫిర్యాదుతో దయ్యాల సతీశ్, నవీన్, దయ్యాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రక్తస్రావంతో గృహిణి మృతి

పెద్దపల్లిరూరల్: భోజన్నపేట గ్రామానికి చెందిన చెల్కల సంధ్య(29) అనే గృహిణికి తీవ్ర రక్తస్రావమై గురువారం మరణించింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన సంధ్యకు 12 ఏళ్లక్రితం భోజన్నపేటకు చెందిన చెల్కల శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. అయినా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేదు. ఈక్రమంలో సంధ్య ఇటీవల మళ్లీ గర్భం దాల్చింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, మళ్లీ సంతానం కలిగితే పోషించడం కష్టమని దంపతులు భావించారు. గర్భం తొలగిపోయేలా ఓ మెడికల్‌షాపు నుంచి తీసుకొచ్చిన ట్యాబ్లెట్లను సంధ్య గురువారం మింగింది. కాసేపటికే రక్తస్రావం మొదలైంది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే భర్త.. నేల చదును చేసే పనుల కోసం వెళ్లాడు. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లే వారు లేకపోవడంతో సంధ్య ఇంట్లో అలాగే పడిఉంది. పిల్లలు రోదిస్తుండడంతో ఇరుగు పొరుగువారు వచ్చి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్రరక్తస్రావం కావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

మామిడి మార్కెట్‌తో ఉపాధి

- పొరుగు రాష్ట్రాల నుంచి కూలీల రాక
- వసతులు కల్పించడంలో వ్యాపారుల నిర్లక్ష్యం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలలోని చల్‌గల్ మామిడి మార్కెట్ కూలీలకు ఉపాధి మార్గంగా మారింది. ఈ మార్కెట్‌లో మామిడి సీజన్‌లో పనిచేసేందుకు స్థానిక కూలీలేకాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుంచి వస్తుంటారు. వేల సంఖ్యలో కూలీలు వస్తున్నప్పటికీ వారితో పనిచేయించుకునే వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ పట్టించుకోకపోవడంతో వారికి కనీస వసతులు కరువయ్యాయి.

వేల సంఖ్యలో కూలీలు

మామిడి సీజన్ ఏప్రిల్, మే నెలల్లో కొనసాగుతుంది. ఈ సీజన్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో రోడ్ల వెంబడి వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేస్తుంటారు. వాటిని ట్రాక్టర్ల నుంచి దింపేందుకు.. కాయలను గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేసేందుకు.. లారీల్లో లోడ్ చేసేందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరమవుతారు. తోటల్లో కాయలు తెంపేందుకు కూడా కూలీల అవసరం ఎక్కువ. ఈ పనులు చేసేందుకు స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూలీలను రప్పిస్తుంటారు. ఒక్కో వ్యాపారి దుకాణంలో కనీసం 50 మంది వరకు కూలీలు పనిచేస్తుంటారు.

నెలరోజుల్లో రూ.25వేల నుంచి రూ.30వేల ఆదాయం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలను వ్యాపారులు వివిధ పనులకు ఉపయోగించుకుంటారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కూలీలను మామిడి కాయలను తెంపేందుకు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు ఉపయోగిస్తారు. ఢిల్లీ, రాజస్థాన్ నుంచి వచ్చిన కూలీలను మామిడికాయల గ్రేడింగ్.. ప్యాకింగ్‌కు ఉపయోగిస్తారు. కూలీలు గ్రూపుగా ఏర్పడి పనులు చేస్తుండటంతో టన్ను అన్‌లోడ్ చేస్తే రూ.250 వరకు చెల్లిస్తారు. గ్రేడింగ్.. ప్యాకింగ్ చేసే వారికి ట్రేకు రూ.15, పెట్టెలను లారీల్లో లోడ్ చేస్తే రూ.3వేల నుంచి రూ.5 వేలు, కాయలు తెంపడానికి వెళ్తే రోజుకు రూ.500 చెల్లిస్తారు. ఆ వ్యాపారి



మామిడి మార్కెట్‌లో గ్రేడింగ్ చేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

దుకాణానికి వచ్చిన కాయలను బట్టి ఒక్కో కూలీ కనీసం 30నుంచి40 రోజుల్లో రూ.30వేల నుంచి రూ.50 వేలు సంపాదించుకుంటారు. ఆయా రాష్ట్రాల్లో వేసవి సీజన్‌లో పనులు లేకపోవడంతో పనుల కోసం జగిత్యాల వస్తుంటారు. ఇలా జిల్లాకు కనీసం ఐదారు వేల మంది కూలీలు వస్తుంటారు.

వసతులు అంతంతే..

మార్కెట్లో కూలీలతో పనులు చేయించేందుకు చూపుతున్న శ్రద్ధ.. వారికి కనీస వసతులు కల్పించడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండుతున్న ఎండలో మార్కెట్ పక్కనున్న వ్యవసాయ భూముల్లో ప్లాస్టిక్ కవర్లతో గుడారాలు వేసుకుని ఉండటం.. షెడ్ల కింద పడుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో వారి బాధలు



లారీల్లో లోడ్ చేస్తున్న మహారాష్ట్ర కూలీలు

వర్ణనాతీతం. చాలామంది రోడ్డపక్కనున్న చెట్ల కింద తీరుతున్నారు. ఈ క్రమంలో వారిని పనులకు తీసుకొస్తున్న వ్యాపారులు వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని స్థానికులు అంటున్నారు.

ఏటా వస్తుంటాం



ఏటా మామిడి సీజన్‌లో జగిత్యాలకు వస్తుంటాం. నెల రోజులపాటు ఇక్కడ పనిచేస్తాం. రూ.30వేల వరకు సంపాదించుకుంటాం. మహారాష్ట్రలో పనులు లేకపోవడంతో ఉపాధి కోసం ఇక్కడకు వస్తాం.

– సేవాలాల్, మహారాష్ట్ర

ప్యాకింగ్ చేస్తాం



మామిడికాయలను గ్రేడింగ్ చేసి, ప్యాకింగ్ చేసేందుకు ఇక్కడకు వస్తాం. మా రాష్ట్రం నుండి కనీసం 500 మంది వరకు వచ్చాం. మామిడి మార్కెట్లో ఏదో పని దొరుకుతుందనే ఆశతో వచ్చి, ఎంతో కొంత సంపాదించుకుని వెళ్లతాం.

– గుడ్డె, ఉత్తరప్రదేశ్

బీజేపీకి గుణపాఠం తప్పదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: కార్మికులు తమ హక్కులను పోరాడి సాధించుకున్నారని, బీజేపీ వారి హక్కులను హరిస్తే కార్మిక లోకం చూస్తూ ఊరుకోదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వే హమాలీ సంఘం కార్మికులు ఏర్పాటుచేసిన పతాకాన్ని ఆవిష్కరించారు. రైల్వే గేట్ నుంచి బద్దం ఎల్లారెడ్డి భవన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య జెండా ఆవిష్కరణ చేశారు. సిమెంట్ గోదాం, ఫర్టిలైజర్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం చాడవెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11ఏళ్లు గడుస్తున్నప్పటికీ కార్మిక హక్కులను హరించడానికి కుటీల ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలోని కార్మికవర్గం అంతా మేడే స్ఫూర్తిగా హక్కుల కోసం పోరాటం చేయాలని, ఈనెల 20న



జెండా ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి ప్రభాకర్, రవీందర్, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెలుండి దామోదర్, ఉల్లిగడ్డల హమాలీ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, కొమురయ్య, సిమెంట్ గోదాం ఫర్టిలైజర్ హమాలీ సంఘం అధ్యక్షుడు జంగా తిరుపతి, నన్నవేన కొమురయ్య, కదారి బీరయ్య, మామిడిపెల్లి శంకర్, ఆకుల లచ్చన్న, ప్రకాశం గంజ్ ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, కాల్వ రాయమల్లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రీల్స్ సరదా

- మానేరువాగులో పడి యువకుడి మృతి

కరీంనగర్‌క్రైం: సోషల్ మీడియా రీల్స్ సరదా ఒక యువకుడి ప్రాణాలు తీసింది. రీల్స్ చేయడానికి కరీంనగర్ శివారులోని మానేరు వాగులోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ లతీఫ్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు మహ్మద్ అర్బాస్ (20) గురువారం మధ్యాహ్నం తన ఇద్దరు స్నేహితులతో కలిసి మానేరు బ్రిడ్జి సమీపంలోని రీల్స్ చేయడానికి వెళ్లాడు. అర్బాస్ మానేరు వాగులోకి దిగి రీల్స్ చేస్తున్న క్రమంలో లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. స్నేహితులు స్థానికులను పిలిచి వారి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అర్బాస్ అప్పటికే మృతిచెందాడు. అర్బాస్ తండ్రి లతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.



మహ్మద్ అర్బాస్ (ఫైల్)

147 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్ క్రైం: చింతగట్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర రూ.73.65లక్షల విలువ గల 147 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు నార్కోటిక్ డీఎస్పీ సైదులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుకుమామిడి నుంచి నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తనిఖీ చేయగా.. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సదయ్య, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన సామల శేషు కలిసి ఇన్నోవా, షిఫ్ట్ కార్లలో 69ప్యాకెట్ల గంజాయిని తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. సదయ్య, సతీశ్‌పై 2014, 2016లో కేయూసీ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

టెంట్‌హౌజ్‌లో అగ్నిప్రమాదం

ధర్మపురి: టెంట్‌హౌజ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగి లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది. బాధితుడు షబ్బీర్ కథనం ప్రకారం.. పట్టణంలోని నక్కలపేట రూట్‌లో ఉన్న టెంట్‌హౌజ్‌లో గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు గోదాంలో ఉన్న టెంట్ సామగ్రికి నిప్పంటించారు. పెద్ద ఎత్తున మంటల చెలరేగడంతో చుట్టుపక్కల వారు షబ్బీర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఫైరింజన్‌కు ఫోన్‌చేయగా.. సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పేశారు. మంటల్లో టెంట్ సామాను తోపాటు డెకరేషన్ సామగ్రి, థర్మకోల్, ప్లాస్టిక్ ఫ్లవర్స్ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.15లక్షల వరకు సామగ్రి దగ్ధమైందని బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.



కాలిపోయిన సామగ్రి

తడగొండ జీపీలో చొరబడ్డ ఆగంతకులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామపంచాయతీ భవనంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని ఆగంతకులు హంగామా చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. వాటర్ ప్లాంట్ గది తాళం పగులకొట్టి, కాయిన్ బాక్స్‌లోని నాణేలను బయట పారబోశారు. అనంతరం జీపీ గది మెయిన్ డోర్ తలుపులు పగులకొట్టి బీరువాలోని ఉన్న కాగితాలు, రిజిష్టర్లను చిందర వందరగా పడేశారు. గురువారం ఉదయం ఎంపీవో శ్రీధర్, పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ టీం ఆధారాలను సేకరించింది. పంచాయతీ కార్యదర్శి సుమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.



చిందరవందరగా కార్యదర్శి గదిలో రికార్డులు

అత్యుత్తమ మహిళా కళాశాలగా 'అల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు తెలంగాణలో ఉత్తమ మహిళా డిగ్రీ కళాశాలగా అవార్డు లభించింది. ఢిల్లీలోని ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ప్రపంచ విద్యా సమ్మిట్–2025లో కేంద్ర జలశక్తి సహాయ మంత్రి భూషణ్ చౌదరి, పీజీ కమిషన్ కౌన్సిలర్ నీలేశ్ కుమార్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్ చేతుల మీదుగా అవార్డును కళాశాల కరస్పాండెంట్ వూట్కూరి రవీందర్‌రెడ్డి స్వీకరించారు. విద్య, నైపుణ్యం, శాస్త్రీయ దృష్టి, నైతిక విలువలు, ప్రాంగణ నియామకాలు, ఉత్తీర్ణతశాతం, విద్యార్థి అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల సాధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకొని అవార్డు ప్రకటించిందని తెలిపారు.



అవార్డు స్వీకరిస్తున్న రవీందర్‌రెడ్డి

జాతీయ పోటీలకు లౌక్యశ్రీ ఎంపిక

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నారవేన లౌక్యశ్రీ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ జిట్టబోయిన శ్రీను తెలిపారు. కర్ణాటకలోని మండ్య జిల్లాలో ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే 39వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థిని హెచ్ఎం మిడిదొడ్డి సమ్మయ్య, ఉపాధ్యాయులు రాజయ్య, దేవదాస్, ప్రకాశ్, శ్రీనివాస్, నరహరి, రాజు, రవికాంత్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, సంపత్, విజేందర్‌రెడ్డి, గీతాలు హర్షం వ్యక్తం చేశారు.



లౌక్యశ్రీ

ఆయిల్‌పాం తోట దగ్ధం

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో గాలికి విద్యుత్ వైర్లు ఒకటికొకటి తగలడంతో అయిల్‌పాం తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన నందికొండ మాధవరెడ్డి మూడు ఎకరాల్లో అయిల్‌పాం సాగు చేశాడు. గురువారం విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు చేనులో పడటంతో మంటలు చెలరేగి ఆయిల్‌పాం దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా నందికొండ మల్లారెడ్డికి చెందిన నాలుగు ఎకరాల మగ వరి మంటలకు అంటుకొని కాలిపోయిందని అన్నాడు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.

జూనియర్ సివిల్ జడ్జిగా కీర్తన

కరీంనగర్‌క్రైం: నగరంలోని అరెపల్లికి చెందిన కట్ట కీర్తన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. 2021లో హైదరాబాద్‌లోని ప్రైవేట్ లా కళాశాల నుంచి ఎల్ఎల్‌బీ, నల్సార్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేసింది. హైకోర్టులో, కరీంనగర్ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతూనే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు సన్నద్ధమైంది. తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. తల్లి పద్మ గృహిణి కాగా, తండ్రి కోటి జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అక్క శ్రీదేవి పీజీ పూర్తి చేయగా, తమ్ముడు సుదర్శన్ బీటెక్ చదువుతున్నాడు.



కట్ట కీర్తన

సంక్షేమాధికారులకు పోస్టింగ్


- ఎస్సీ వసతిగృహాల్లో నియామకం
- కాళేశ్వరం జోన్‌లో 19మంది రిపోర్టు

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ వసతిగృహ సంక్షేమాధికారులుగా ఎంపికై పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి బుధవారం రాత్రి నియామక పత్రాలు అందజేశారు. గత ఏడాది జూన్ 24నుంచి 29వరకు కంప్యూటర్ ఆధారిత(సీఆర్‌బీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించగా సెప్టెంబర్ 20న ఫలితాలు విడుదలయ్యాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో 24మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేసిన పంపగా.. ఐదుగురు అభ్యర్థులు వివిధ కారణాలతో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాలేదు. దీంతో 19మందికి నియామక పత్రాలు అందజేయగా.. గురువారం కేటాయించిన వసతిగృహాల్లో రిపోర్టు చేశారు. వీరిలో 12మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. పెద్దపల్లికి ఐదుగురిని కేటాయించారు. తోట శైలజ ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ(గర్ల్స్) పెద్దపల్లి, ఇసంపల్లి రమ్య ఎస్సీ గర్ల్స్ హాస్టల్ మంథని, ప్రశాంత్, ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్ మంథని, డి.తిరుపతి, ఎస్సీడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్ మంథని, సాధుల రమేశ్, ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్ మంథనికి కేటాయించారు.



నియామకపత్రాలు అందజేస్తున్న ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్‌గౌడ్





రేపటి నుంచి నృసింహస్వామి నవరాత్రి ఉత్సవాలు

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి జయంతోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి 11 వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే స్వామి వారి ఉత్సవాలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈవో శ్రీనివాస్ తాగునీరు, చలువ పందిళ్లు, భక్తులకు కావాల్సిన లడ్డూప్రసాదాలను సిద్ధం చేశారు.

– ప్రతిరోజూ ఉదయం మంగళవాయిద్యాలతో గోదావరి నుంచి బిందె తీర్థం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు, 7న సహస్ర కలశాభిషేకం, 8న చందనోత్సవం, 9న అన్నకూటోత్సవం, పల్లవోత్సవం, వసంతోత్సవం, 10న లక్ష తులసి అర్చన, 11న జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు.

జీవాల దాహం తీర్చుదాం



రామగుండం బల్దియాలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు



గోదావరిఖని ఎల్బీనగర్‌లో పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టె

- పెరుగుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- తల్లడిల్లుతున్న పక్షులు, జంతువులు
- నివాసాలు, ఖాళీ ప్రదేశాల్లో నీటితొట్టెలు

కోల్‌సిటీ(రామగుండం): వేసవిలో నీటి కోసం జనాలు అల్లాడిపోతారు. వివిధ అవసరాల కోసం ఇంట్లోంచి బయటకు వెళ్తే.. దాహం తీర్చుకునేందుకు నీళ్లు ఎక్కడ లభిస్తాయా? అని ఆశ పడతారు. ఎప్పటికప్పుడు దాహం తీర్చుకునేందుకు తహతహలాడతారు. మరి మూగజీవాల పరిస్థితి ఎలా ఉంటుంది? అవి దాహం ఎలా తీర్చుకుంటాయి? మనం ఏమైనా ప్రయత్నం చేస్తే వాటి దాహం తీరుతుందా? ఇలాంటి సందేహాలకు సమాధానమిస్తున్నారు కొందరు పక్షులు, జీవాల ప్రేమికులు.

పక్షుల శరీర ఉష్ణోగ్రతలు అత్యధికం..

సాధారణంగా పక్షుల శరీర సాధారణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటాయని పక్షిప్రేమికులు చెబుతున్నారు. ఈ ఉష్ణోగ్రతలు దాటితే ఎక్కువ సేపు అవి జీవించలేవని అంటున్నారు. అందుకే చాలా పక్షులు ఎక్కడ నీరు కనిపిస్తే అందులో మునకేస్తూ శరీర ఉష్ణోగ్రతలు తగ్గించుకుంటాయి. జనం కోసమైతే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? వీటి కోసం ఎవరు ఆలోచిస్తారు? ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో నమోదవుతున్నాయి. అందుకే మూగజీవాలకు ఊపిరి పోయడానికి మనమే ఒకడుగు ముందుకేద్దాం. ఇంటి ఆవరణ, ఇంటి బయట కాసిన్ని నీళ్లు పెట్టి వాటి దాహం తీర్చుదాం.

అందరూ స్పందించాలి

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కుళాయిలు అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితుల్లో పెంపుడు కుక్కలు, వీధికుక్కలు, పక్షుల దాహం తీర్చేందుకు ప్రతీ ఒక్కరు స్పందించాలి. ప్రభుత్వంతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలి. కుక్కలు, పక్షులు గొంతెండి మృత్యువాత పడకుండా ఇంటి ఆవరణ, భవనాల ఎదుట, ప్రధాన కూడళ్లలో నీటితొట్లు ఏర్పాటు చేసి ఎప్పుడూ తాగునీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా పక్షులకు ఇంటిదాబాపై తొట్టిలాంటి మట్టిపాత్రలు ఉంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటిని పోస్తూ ఉండాలి. వాటికి దాహం వేసిన సమయంలో అలవాటుగా రోజూ అక్కడికి వచ్చి దాహం తీర్చుకుంటాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అయితే బల్దియా ఆధ్వర్యంలో గతేడాది వేసవిలో సుమారు 90 చోట్ల నీటితొట్టెలు ఏర్పాటు చేసి నీళ్లు పోశారు. వీటిని ప్రస్తుతం పట్టించుకున్న నాథుడు లేడు. కొందరు స్థానికుల ఇళ్ల ఎదుట, దుకాణాల ముందున్న తొట్టెల్లో నీళ్లు పోసి దాహం తీర్చుతున్నారు. ఇలాగే ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తే మంచిదని మూగజీవాల ప్రేమికులు కోరుతున్నారు.



మూగజీవాల దాహం తీర్చడానికి నీటి బకెట్‌ను పెడుతున్న వ్యాపారి యుగేందర్